TGTEL/26/A6780

# స్పందన
తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :33 | పేజీలు 8 వెల : 3 | శుక్రవారం 23 అక్టోబర్ 2026

## విలేకరులు కావలెను
జర్నలిస్టులే యాజమాన్యంగా నడపబడుతూ ప్రజా గొంతుకై అనతికాలంలోనే ప్రభంజనం సృష్టిస్తున్న స్పందన దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.ఆసక్తి ఉన్న వార
ఈ క్రింది నెంబర్లలలో సంప్రదించండి
9440657806,9440697806



## భారత్, పోలండ్ విస్తృత
# రక్షణ బంధం
### 2030 కల్లా 6 బిలియన్ డాలర్లకు వాణిజ్యం
### ఇరు దేశాల ప్రధానుల నిర్ణయం
### మోదీ తన మిత్రుడు కావడం గర్వకారణమన్న టుస్క్

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: భారత్, పోలండ్‌ల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిశ్చయించాయి. మన దేశంలో 3 రోజుల పర్యటనకు వచ్చిన పోలండ్ ప్రధాని డొనాల్డ్ టుస్క్, ప్రధాని మోదీ మధ్య గురువారం ఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. ఇందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం ఉన్నాయి.

-మిగతా 2 లో..

## ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి
# ‘బీసీ-ఏ’లోకి చేరుస్తాం
### చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా న్యాయ నిపుణులను సంప్రదిస్తాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఉపసంఘం

వివాదాలకు ఆస్కారం లేకుండా ఇతర కుల సంఘాలతో చర్చిద్దాం

పండుగ సాయన్న జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ--ఏ గ్రూపులో చేర్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గురువారం రవీంద్ర భారతిలో జరిగిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన.. ముదిరాజ్‌లు సహా వివిధ కులాల వర్గీకరణ అంశంపై ప్రభుత్వం పక్కా ప్రక్రియను అనుసరిస్తుందన్నారు. బీసీ--డీ నుంచి మరో గ్రూపులోకి మార్చే అంశంపై గతంలో సరైన లెక్కలు లేకపోవడం వల్ల న్యాయస్థానాలు తిరస్కరించాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రాతిపదికగా భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ముదిరాజ్‌లను గ్రూపు--ఏలోకి మార్చడంపై సమగ్రంగా అధ్యయనం చేస్తామన్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 22 : “ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చేందుకు కృషిచేస్తాం. వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇందుకు హామీ ఇచ్చినా.. ముదిరాజ్‌లు ఎంతమంది ఉన్నారో తెలియకపోవడంతో సుప్రీంకోర్టు ఆ ప్రక్రియను నిలిపివేసింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కులగణన నిర్వహించాం. ఇప్పుడు ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చేందుకు అవకాశం లభించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఉపసంఘం ఏర్పాటు చేద్దాం. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తుంది. వివాదాలకు ఆస్కారం లేకుండా గంగపుత్రులు, ఇతర కులాల వారితో చర్చిద్దాం” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వెనకబడిన తరగతుల

-మిగతా 2 లో..



## సింగరేణిని ప్రైవేటీకరిస్తే
# ఊరుకోం
### కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం
### అన్యాయం జరిగితే సహించబోం
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 22 : ‘తెలంగాణ కొంగు బంగారం సింగరేణిని ప్రైవేటీకరిస్తే ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదు.. సంస్థను బలహీనపరిచే దిశగా అడుగులేస్తున్న కాంగ్రె స్ సర్కార్ కుట్రలను అడ్డుకుంటాం.. ప్రభుత్వ పెద్దల అవినీతి నుంచి కాపాడుకుంటాం’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

-మిగతా 2 లో..



## తెలంగాణ సంస్కృతికి ప్రతీక
# అలయ్ బలయ్
### డ్రగ్స్ నియంత్రణ సమష్టి బాధ్యత: గవర్నర్
### భారత్‌లోనే సెక్యులరిజం ఉంది: కిషన్ రెడ్డి
### ఆత్మీయ అనుబంధాలు సమాజంలో ప్రతి ఒక్కరికీ కీలకం: వెంకయ్యనాయుడు
### నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వేడుక

భారతదేశ భిన్నత్వంలో ఏకత్వం భావనకు నిలువెత్తు సుందరరూపం.. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాల వారసత్వం ‘దత్తన్న అలయ్-బలయ్’ కార్యక్రమంలో సాక్షాత్కరిస్తోందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా కొనియా డారు. అన్ని రాష్ట్రాల విశిష్ట సాంస్కృతిక వారసత్వా లను గౌరవించడమే భారత్ ఐకమత్యానికి చిహ్నమన్నారు. గురువారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ‘నషా ముక్త్ భారత్--వికసిత్‌భారత్ 2047’నినాదంతో నిర్వహించిన దత్తన్న అలయ్ బలయ్ కార్యక్రమంలో గవర్నర్ మాట్లా డారు.

హైదరాబాద్, అక్టోబరు 22 : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి పండుగ తర్వాత నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం ప్రజలను ఏకం చేస్తుందని, సమాజంలో ప్రేమానురాగాలు, సోదరభావాన్ని పెంపొందిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న అలయ్ బలయ్‌పై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ఈ వేడుకల ద్వారా సజీవంగా

-మిగతా 2 లో..

## విద్యుత్ కొరత రాకుండా
# చర్యలు చేపట్టాలి



ఉన్నతాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

### యాదాద్రి ప్లాంట్‌లో 2 యూనిట్లకు కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా
### మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం
### బకాయిల వసూళ్లు, విద్యుత్ ఉత్పత్తి పెంపుపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

హైదరాబాద్, అక్టోబరు 22 : కరువు పరిస్థితుల్లో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బొగ్గు లభ్యత, బకాయిల వసూళ్లపై సమగ్ర కార్యా చరణతో ముందుకు సాగాలని సూచించారు. సచివాలయంలో గురువారం విద్యు త్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్ప త్తిని మరింత పెంచాలని భట్టి చెప్పారు. టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024--25 ఆర్థిక సంవత్సరంలో 65.90 మిలియన్ యూని ట్లుగా ఉండగా,

-మిగతా 2 లో..

## టీడీఆర్ సేవలకు ఆధార్‌తో గుర్తింపు నిర్ధారణకు
# ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్: టీడీఆర్ సేవలకు ఆధార్‌తో గుర్తింపు నిర్ధారణకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆస్తి యజమానులు, బిల్డర్లు, డెవలపర్లకు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్, లాగిన్, దరఖాస్తుల ప్రక్రియలో ఆధార్ వినియోగించవచ్చని తెలిపింది. ప్రాపర్టీ డేటాబేస్‌తో ఆధార్ అనుసంధానానికి అవకాశం కల్పించింది. ఖుజా, GHMC అధికారులకు ఆన్‌లైన్ అథెంటికేషన్ సదుపాయం కల్పించింది. నకిలీ గుర్తింపులు, మోసాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని రాష్ట్ర సర్కార్ పేర్కొంది. ఆధార్ అథెంటికేషన్ స్వచ్ఛందమేనని.. తప్పనిసరి కాదని స్పష్టంచేసింది. ఈ మేరకు జీవో నంబర్ – 255ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది.

## సైబర్ ప్రపంచంలో వరుస దాడులు..
### పీహెచ్‌పీ నుంచి ఎస్‌బీఐ వరకు కలకలం!

పీహెచ్‌పీలో రెండు తీవ్ర భద్రతా లోపాలు

ఈముద్ర కీలను సెకనులోపే ఛేదించిన పరిశోధకులు

నోడ్.జేఎస్, LiteLLMలోనూ భద్రతా సమస్యలు

రైల్వే వినియోగదారుల డేటాపై అనుమానాలు

ఏఐ టూల్‌తో 2,250కిపైగా సంస్థల లక్ష్యం





## తెలంగాణ సంస్కృతికి ప్రతీక
# అలయ్ బలయ్

(మొదటిపేజీ తరువాయి)

ఉంచుతున్న దత్తాత్రేయ కృషి ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు మోదీ.. దత్తాత్రేయకు ప్రత్యేకంగా లేఖ రాశారు. ఈ ఏడాది అలయ్ బలయ్ సమ్మేళనానికి 'నషా ముక్త్ భారత్.. వికసిత్ భారత్ 2047'అనే ఇతివృత్తాన్ని ఎంచుకోవడం జాతీయ సంకల్పాన్ని గుర్తుచేస్తోందని మోదీ పేర్కొన్నారు. కాగా, హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి నేతృత్వంలో గురువారం వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ సమష్టి బాధ్యతని అన్నారు. ఇది ఒక్క పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, విద్యాసంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తుకు డ్రగ్స్ ముప్పులా మారుతున్నాయని పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ సంపద, స్నేహ సంపద ప్రతీ ఒక్కరికీ ముఖ్యమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు అన్నారు మానవ జీవితానికి ఆత్మీయ అనుబంధాలు అత్యంత అవసరమని చెప్పారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో సెక్యులరిజం లేదని, అక్కడ నియంతృత్వం మాత్రమే ఉందని, కేవలం భారత్‌లోనే సెక్యూలరిజం ఉందని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. హిందువులు ఐక్యంగా ఉండాలన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ రాష్ట్రాభివృద్ధికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు, మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, డీకే అరుణ, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావు, మాజీ మంత్రి జానారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త రూల్స్..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించే ఈ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు సాగాలని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. భాగస్వామ్యపక్షాల నుంచి 30 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫీడ్‌బ్యాక్ ఆధారంగా తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం.. పేరు, చిరునామా వివరాల మార్పు కోసం వచ్చే దరఖాస్తులను అధికారులు 15 రోజుల్లోగా ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలి. ఒకవేళ తిరస్కరిస్తే తగిన కారణం తెలపాల్సి ఉంటుంది. చిరునామా మార్పు దరఖాస్తుపై 30 రోజుల్లోగా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తారు. ఆధార్ అథంటికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందే కొన్ని డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని భావిస్తున్నారు. పేరు, చిరునామా వంటి వ్యక్తిగత వివరాల మార్పులకూ ఛార్జీలు తొలగించనున్నారు. గుర్తింపు, వయసు, చిరునామా ధ్రువీకరణ కోసం ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, జనన ధ్రువీకరణ పత్రాలు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, ఇ-రేషన్ కార్డు, గడిచిన 3 నెలల్లోపు వచ్చిన విద్యుత్, గ్యాస్ బిల్లులను అనుమతిస్తారు. చిరునామా ధ్రువీకరణ పత్రాల జాబితా నుంచి ఎల్ఐసీ పాలసీలను తొలగించాలని ముసాయిదా పేర్కొంది. అలాగే, కొత్తగా జారీ చేసే డ్రైవింగ్ లైసెన్సులు, రెన్యువల్ లైసెన్సులను లేమినేటెడ్ లేదా పీవీసీ కార్డు రూపంలో జారీ చేయాలని మ-ుసాయిదాలో కేంద్రం పేర్కొంది.

## నేడు దక్షిణాది రాష్ట్రాల పోలీసుల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీపలకు చెందిన డీజీపీలు, ఐజీలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో, సీబీఐ, డీఆర్ఐ, ఎన్ఐఏ, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఉగ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాల అనంతర పరిస్థితులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థి నేరాలు, యువత నిరసనలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలు ప్రధాన అజెండాలో ఉన్నాయని తెలిపారు.



## భారత్, పోలండ్ విస్తృత రక్షణ బంధం

(మొదటిపేజీ తరువాయి)

ఉక్రెయిన్-రష్యా, పశ్చిమాసియాల్లో శాంతి సాధనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్, పోలండ్‌లు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు మోదీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. "పోలండ్‌తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించాం. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించాం" అని మోదీ పేర్కొన్నారు. "రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జామ్‌నగర్, కొల్హాపుర్ రాజ కుటుంబాలు.. పోలండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమిచ్చాయి. 2022లో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రారంభమైనప్పుడు అదే తరహాలో భారతీయులను తరలించేందుకు పోలండ్ సహకరించింది" అని మోదీ వివరించారు. తమ డ్రోన్లు ఎంతో ఉపయోగకరమని పోలండ్ ప్రధాని ఓ ఆసక్తికర వ్యాఖ్య చేశారు. అయితే వివరాలను వెల్లడించలేదు.

## ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి
# 'బీసీ-ఏ'లోకి చేరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ముదిరాజ్లకు ప్రత్యేక గుర్తింపు ఉందని.. జమీందార్లు, జాగీర్దార్లు, భూఆక్రమణదారులకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్నను ఇప్పటికీ స్మరించుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. తన భూమిని లాక్కున్నారని ఆవేదనకు గురైన ఆయన తనలాంటి వారికి న్యాయం చేయాలన్న లక్ష్యంతో తిరుగుబాటును ప్రకటించారని తెలిపారు. "భూస్వాముల ఇళ్లల్లోని డబ్బు, బంగారం, ధాన్యాన్ని తీసుకొచ్చి పేదలకు పంపిణీ చేశారు.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు సాయం చేశారు. ఆయనను అప్పటి ప్రభుత్వం ఖైదు చేస్తే వనపర్తి రాణి శంకరమ్మ నిజాం నవాబుకు భారీ మొత్తం కప్పంగా చెల్లించి సాయన్నను విడుదల చేయించారు. ఇప్పటికీ రాష్ట్రంలో వరినాట్లు వేసేటప్పుడు పండుగ సాయన్న విప్లవ గీతాలు పాడుకుంటున్నారు. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగిన వీరుడి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం లేదన్న అంశం నాకు మంత్రి వాకిటి శ్రీహరి చెప్పేంతవరకు తెలియదు. ఇకపై అధికారికంగా నిర్వహిస్తాం. ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని నెలకొల్పుతాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. "కులగణన వల్లే రాష్ట్రంలో ముదిరాజ్‌ల జనాభా తెలిసింది. నా కొడంగల్ నియోజకవర్గంలో అత్యధికులు ముదిరాజ్‌లే. బడుగు, బలహీనవర్గాలకు సామాజిక న్యాయం చేసేందుకే ఇదంతా చేశాం. ఇందులో భాగంగానే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇచ్చాం. నీలం మధు ముదిరాజ్‌కు ఎంపీగా పోటీచేసేందుకు అవకాశం కల్పించాం. దేశవ్యాప్తంగా జనగణనలో భాగంగా కులగణన చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నాం. దశాబ్దాలుగా ఎస్సీ సోదరులు వర్గీకరణ కోసం పోరాడారు. వర్గీకరణకు మార్గం సుగమం కావడంతో విద్యా, ఉ



ద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి చరిత్ర సృష్టించాం. ఎన్టీఆర్, చంద్రబాబు, వై.ఎస్., కేసీఆర్‌లు వారి హయాంలలో చేసిన మంచి పనులతో పోలిస్తే మేం అంతకు మించి చేస్తున్నాం. ఎన్టీఆర్ రూ.2కు కిలోబియ్యం ఇస్తే... మేం ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నాం. చంద్రబాబు హైటెక్ సిటీని ఏర్పాటు చేస్తే... మేం శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. వై.ఎస్. రైతులకు ఉచిత విద్యుత్తు ఇస్తే.. మేం పేద కుటుంబాలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. ఆయన ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.2 లక్షల విలువైన వైద్యసేవలు అందిస్తే మా ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచింది. కేసీఆర్ రూ.లక్ష రైతు రుణమాఫీ చేస్తే... మేం రూ.2 లక్షలు చేశాం. రైతులను సన్న వడ్లు పండించండి.. మా ప్రభుత్వం చూసుకుంటుందంటే.. కొందరు నన్ను పిచ్చివాడన్నారు. ఇప్పుడు చూడండి... సన్న బియ్యానికి మార్కెట్‌లో కిలో రూ.98 ధర పలుకుతోంది. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్నా సరే.. రాష్ట్రంలోని 3.48 కోట్ల మంది ప్రజలకు ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. పేదల కోసం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం" అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## విద్యుత్ కొరత రాకుండా
# చర్యలు చేపట్టాలి



(మొదటిపేజీ తరువాయి)

2025--26లో సుమారు 76.46 మిలియన్ యూనిట్లకు చేరిందని అధికారులు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి రోజు వారీ సగటు ఉ త్పత్తి 90.97 మిలియన్ యూనిట్లకు పెరిగిందని తెలిపారు. ప్రస్తు తం సాధిస్తున్న ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని భట్టి ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం సూచి ంచారు. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్ కు అనుసంధానించినట్టు తెలిపారు. సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధ ప్రాతి పదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసు కొచ్చేందుకు చర్యలు చేపడుతు న్నట్లు వెల్లడించారు. యాదాద్రి ప్లాంట్‌లోని రెండు యూని ట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యా మ్నాయ బొగ్గు సరఫరా మార్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల పరిష్కా రానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిత్తల్, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తాని యా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి. పాటిల్, ఆర్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ పాల్గొన్నారు.

# సింగరేణిని ప్రైవేటీకరిస్తే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

కార్మికుల సంక్షేమంపై రాజీపడే ప్రసక్తేలేదని, వారి హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుందని ప్రకటించారు. గురువారం తెలంగాణ భవన్‌లో కోల్‌బెల్ట్ ఏరియా బీఆర్ఎస్ ముఖ్యనేతలు, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులతో కేటీఆర్ సమావేశమయ్యారు. గోదావరిఖనిలో కార్మిక గర్జనను విజయవంతం చేసి న పార్టీ నేతలు, కార్యకర్తలను అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని కోరారు. అనంతరం సింగరేణిలో ప్రస్తుత పరిస్థితులు, ప్రభు త్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ భవిష్యత్‌పై చర్చించారు. బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్ బ లోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. గని కార్మికుల హక్కుల సాధన, సంస్థ పరిరక్షణకు పోరాటానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఇటీవలి సభలో ప్రస్తావించిన సంస్థ ఆర్థిక వ్యవహారాలు, బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, టెండర్లలో అక్రమాల ఆరోపణలు, సంస్థకు రావాల్సిన నిధులు తదితర అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమన్వయంతో గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్తాచాటాలని కోరారు. కేసీఆర్ కడుపులో పెట్టుకొని చూసుకున్న సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకొనే ప్రసక్తిలేదని కేటీఆర్ తేల్చిచెప్పారు. సింగరేణికి అన్యాయం చేస్తున్న రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలను గట్టిగా నిలదీయాలని కేటీఆర్ సూచించారు. రెండు ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాన్ని కార్మిక కుటుంబాలకు విడమరచి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టంచేశారు. కార్మికులకు లాభాల వాటా, ఇచ్చిన వారసత్వ ఉద్యోగాలు, మెడికల్ బోర్డుల నిర్వహణ, కార్మిక కుటుంబాలకు కల్పించిన వైద్య సదుపాయాల గురించి వివరించాలని సూచించారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటా, పండుగల బోనస్,



ఇతర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రశ్నించాలని, కార్మికుల హకుల సాధన కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు. చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందని పునరుద్ఘాటించారు. సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలు ఎదురొనేందుకు బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సమావేశంలో చర్చించారు. సింగరేణి ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు కార్మికులకు అండగా ఉండాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ పాలనలో ఎదురవుతున్న సమస్యల నేపథ్యంలో కార్మికులు, సింగరేణి ప్రాంత ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతున్నదని సమావేశంలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్మిక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నామని వివరించారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల హకుల సాధన, సంక్షేమ కార్యక్రమాల పునరుద్ధరణ, టీబీజీకేఎస్ బలోపేతం లక్ష్యం గా రానున్న రోజుల్లో సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. కార్మికులకు అండగా ఉంటూ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టంచేశారు. సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు కోలేటి దామోదర్, చిరుమల్ల రాకేశ్, నాయకులు కౌశికహరి, విజయారెడ్డి, సమ్మయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా..
# కాంగ్రెస్ మొద్దునిద్ర

- 12లక్షల ఎకరాల్లో పంట నష్టం
- తక్షణమే కరువు మండలాలు ప్రకటించాలి
- దేవాదుల, కల్వకుర్తి మోటర్లు 24గంటలు నడుపాలి
- అధికారులపై చిందులేస్తే రైతుల బాధలు తీరవు
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్ డిమాండ్

**గజ్వేల్, అక్టోబర్ 22:** కాంగ్రెస్ సర్కార్ వైఫల్యంతో 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతుంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువేనని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లిలో గురువారం ఎండిన వరి పొలాలను రైతులతో కలిసి హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటలు, ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. రోమ్ నగరం తగులబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్టు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎల్ నినో వస్తుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు ముందే చెప్పినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బొగ్గు నిల్వలు, విద్యుత్ కొనుగోళ్లు చేయకుండా చేతులు కాలాక అధికారులపై చిందులేస్తే రైతుల బాధలు తీరవంటూ నిప్పులుచెరిగారు. ఆ అధికారులను కాదు.. అసమర్థ సీఎం, విద్యుత్ శాఖ మంత్రిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పొరుగున మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు తక్షణ సాయంగా ఎకరాకు రూ.5వేలు విడుదల చేసిందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిందని, మరికొన్ని రాష్ట్రాలు తాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం కలెక్టర్లకు నిధులు విడుదల చేశాయని హరీశ్‌రావు తెలిపారు. కానీ, తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు కరువు మండలాలు ప్రకటించలేదని మండిపడ్డారు. సమస్య నెత్తిమీదికి వచ్చాక నిన్న యాదాద్రి ఐదో యూనిట్‌ను సింక్రనైజ్ చేశారని, ఈ పని ముందే చేసి ఉంటే పంటలు ఎండేవి కావని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించి ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కరువు కాలంలో ప్రజలపై రూ. 5,420కోట్ల కరెంట్ బిల్లుల భారం, ఆర్టీసీ చార్జీల పెంపు దుర్మార్గమని, పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొందామంటే కరెంట్ దొరుకడం లేదు, నీళ్లను కొనలేమని మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి ముందస్తుగా పీపీఏలు చేసుకొని బొగ్గు నిల్వలు సమకూర్చితే ఇవాళ రైతులకు ఈ పరిస్థితి వచ్చేదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రేవంత్‌వి బీద అరుపులని, కరోనా కాలంలో కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ధైర్యం చెప్పి తామున్నామనే విశ్వాసం కల్పించారని గుర్తుచేశారు. కరోనా విపత్తులో కోటి టన్నుల పంట పండిస్తే ఎల్ నినో సాకుతో రేవంత్‌రెడ్డి క్రాప్ హాలిడే ప్రకటించి రైతులను శిక్షిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో కన్నెపల్లి మోటర్లు ఆన్ చేయకుండా, దేవాదుల, కల్వకుర్తి మోటర్లను 24గంటలు నడుపకుండా సాగునీటి కరువు సృష్టించారని విమర్శించారు. ఇవాళ సీఎం సొంత జిల్లా పాలమూరు కరువుకు ఎల్ నినో కారణం కాదని రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యమే కారణమని నిప్పులు చెరిగారు. కన్నెపల్లి, దేవాదుల కల్వకుర్తి మోటర్లను తక్షణమే 24గంటల పాటు నడిపించాలని డిమాండ్ చేశారు. తాగునీటి ఎద్దడి నివారణకు కలెక్టర్లకు నిధులు ఇచ్చి ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లను భాగస్వాములను చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'మా గూడెంలో మా రాజ్యం కావాలి..' అనే నినాదంతో జల్, జంగిల్, జమీన్ కోసం జీవితాన్ని ధారబోసిన ఆదివాసీ యోధుడు కుమ్రం భీం, అన్యాయంపై తిరుగబడి, నిరుపేదల పక్షాన నిలిచిన బహుజన వీరుడు పండుగ సాయన్నల పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శమని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కొనియాడారు. మహనీయుల జయంతి సందర్భంగా గురువారం 'ఎక్స్' వేదికగా నివాళులర్పించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కుమ్రం భీం ఆత్మగౌరవ భవనం నిర్మించడంతోపాటు, వారి జయంతిని అధికారికంగా నిర్వహించి సముచిత గౌరవమిచ్చినట్టు చెప్పారు. సాయన్న పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పునరుద్ఘాటించారు. వారి ఆశయసాధనకు కృషిచేయాలని సూచించారు.

స్పందన
తెలుగు దినపత్రిక



## హైదరాబాద్‌లో ఘనంగా
# 'అలయ్ బలయ్'..

హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా నిర్వహించే 'అలయ్ బలయ్' సాంస్కృతిక కార్యక్రమం ఈరోజు అట్టహాసంగా ప్రారంభమైంది. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మిల నేతృత్వంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెబుతూ, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.ప్రతి ఏటా దసరా తర్వాత కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. బతుకమ్మ, బోనాలు, డప్పు, గుస్సాడీ, కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది 'నషా ముక్త్ భారత్' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం.ఈ వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలు పార్టీల నేతలు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో రాణించిన వారిని సత్కరించనున్నారు. వచ్చిన అతిథుల కోసం తెలంగాణ సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. 2005లో దత్తాత్రేయ ప్రారంభించిన ఈ అలయ్ బలయ్, తెలంగాణ వారసత్వాన్ని జరుపుకొనే ఒక ప్రముఖ సామాజిక-సాంస్కృతిక వేడుకగా గుర్తింపు పొందింది.



# తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు..
## బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం



తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో అక్టోబర్ 23న (శుక్రవారం) మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది.

థాయ్‌లాండ్ గల్ఫ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఆవర్తనానికి అనుబంధంగా ఈ వ్యవస్థ బలపడుతోంది. ఇది ఉత్తర అండమాన్ సముద్రం వైపు కదిలి, ఆ తర్వాత పశ్చిమ-వాయవ్య దిశగా ప్రయాణించనుంది. దీని గమనం, తీవ్రతను బట్టి రెండు రాష్ట్రాలపై వాతావరణ ప్రభావం ఆధారపడి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వర్ష హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నేడు, రేపు ( 22, 23వ తేదీల్లో) కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు తదుపరి సూచనలు అందే వరకు వేటకు వెళ్లవద్దని సూచించింది.

తెలంగాణలో తేలికపాటి జల్లులు

ఇక తెలంగాణలోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడే కొద్దీ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడటం వంటివి చేయరాదని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కోత కోసిన పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని అధికారులు కోరుతున్నారు.

# ప్రకృతితో ఘర్షణ వద్దు..
# విపత్తులను తప్పించలేం



ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు.ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు.

# మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు..





ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది.ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు సంబంధించిన రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు.

# జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలి

**- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్**

**జిన్నారం, అక్టోబర్ 22(స్పందన):**



ప్రభుత్వ జీవో ప్రకారం జిన్నారం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన డీఎస్పీ కార్యాలయాన్ని ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసేందుకు పోలీస్ శాఖ సన్నాహాలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై బీజేపీ ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. జిన్నారంలో మంజూరైన డీఎస్పీ కార్యాలయాన్ని ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిన్నారం ప్రాంతం గ్రామీణ ప్రాంతాలతో విస్తరించి ఉందని, ఇక్కడ డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతానికి డీఎస్పీ కార్యాలయం మంజూరు కావడం శుభపరిణామమని, దాని ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరడంతో పాటు ప్రాంత అభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశంపై పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, జర్నలిస్టులు, కుల సంఘాల నాయకులు, యువకులు ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డీఎస్పీ కార్యాలయాన్ని ఇస్నాపూర్‌కు తరలించే ప్రయత్నాలను విరమించుకుని, జిన్నారంలోనే ఏర్పాటు చేసేలా ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి జీవో ప్రకారం కార్యాలయాన్ని జిన్నారంలో ఏర్పాటు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు చేపడతామని డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్ హెచ్చరించారు.



# వావిలాల అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

**- మహిళ గుర్తింపు కోసం పోలీసుల ప్రయత్నం..**

**- మృతికి గల కారణాలపై కొనసాగుతున్న దర్యాప్తు**

**జిన్నారం, అక్టోబర్ 22,(స్పందన):**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. గురువారం అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించి క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. మృతిచెందిన మహిళ ఎవరనే విషయాన్ని గుర్తించడంతో పాటు, ఆమె మరణానికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని సీఐ నాగార్జున గౌడ్ తెలిపారు. మృతిచెందిన మహిళ ఫొటోను గుర్తించిన వారు లేదా ఆమెకు సంబంధించిన వివరాలు తెలిసిన వారు జిన్నారం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



# ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్,

**పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే మాణిక్యరావు అలై బలైతో ఆత్మీయ పలకరింపులు..**

**జహీరాబాద్ అక్టోబర్ 22 ( స్పందన**

విజయ దశమి దసరా పండుగను పురస్కరించుకొని లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ లోని లింగాయత్ సమాజ్ భవనంలో గురువారం నాడు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మేళనానికి హాజరైన లింగాయత్ సమాజ్ ప్రతినిధులు, సభ్యులను వారు ఆత్మీయంగా పలకరించారు. దసరా పండుగ సంప్రదాయంలో భాగంగా అలై బలై నిర్వహించి, పరస్పరం శుభ కాంక్షలు తెలియ జేసుకున్నారు. ఈ కార్యక్రమం ఆప్యాయత, సోదర భావం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. అనంతరం మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ దసరా పండుగ విశిష్టతను వివరిస్తూ, చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, ఐక్యత మరియు సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తాయని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం సోదర భావంతో మెలుగుతూ పండుగలను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనం పండుగ వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావ్, డిసిసిబి చైర్మన్ శివకుమార్, మాజీ టీజీఐడీసీ చైర్మన్ తన్వీర్, కౌన్సిలర్ కవిత అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు పాటిల్, భాస్కర్ రెడ్డి, లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు రాజశేఖర్ శెట్కార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నామ రవి కిరణ్, లింగాయత్ సమాజ్ ప్రతి నిధులు, స్థానిక ప్రజా ప్రతి నిధులు, నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లం పండించే పొలాల్లో కొత్తగా వచ్చిన అగ్గి తెగులును పోలిన తెగులు పై కేంద్ర బృందం పర్యటన...



**జహీరాబాద్ అక్టోబర్ 22 (స్పందన)**

కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం (సిఐపిమ్ సి)కేంద్ర అధికారులు వెంకటరెడ్డి, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, బసవన్నప్ప ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ఉదయశంకర్ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ల బృందం,గురువారం నాడు ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి శాస్త్రవేత్త డా.మౌనిక, డిడిఎస్ కెవికె శాస్త్రవేత్త శైలజ స్థానిక ఉద్యాన శాఖ అధికారి సునీత రోస్,హెచ్ఈఓ సతీష్, అధికారులు పర్యవేక్షణ లో భాగంగా అల్లం సాగు చేసిన పొలాల్లో కొత్తగా వచ్చిన అగ్గి తెగులును పోలిన తెగులును పరిశీలించారు. ఈ తెగులు కర్ణాటక మరియు కేరళ రాష్ట్రాల్లో కొత్తగా వ్యాపించి ఉందని, మన రాష్ట్రం లో ఇప్పుడు కనిపిస్తుందని చెప్పారు. ఈ తెగులు కలుగజేసే శిలీంద్రం ప్రాక్షిపై రీక్యులేరియా జిన్జబెరిస్ గ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పైస్ రీసెర్చ్ కేరళ వాళ్ళు నిర్ధారించారు. నివారణ ప్రొపికోనజోల్ లేదా టెబుకోనజోల్ అనే మందును లీటరు నీటికి ఒక మిల్లీ లీటరుగ వేసి పై పాటుగా పిచికారి చెయ్యాలన్నారు. విత్తన శుద్ధి కూడా ఇవే మందులతో చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా తెగులు సోకిన ప్రాంతాల నుండి ఎట్టిపరిస్థితుల్లోనూ విత్తనానికి వాడే కొమ్ములను తెచ్చుకోకూడదు అని చెప్పారు.

# అంగన్వాడీ చిన్నారుల వికాసానికి న్యూ ల్యాండ్ పరిశ్రమ చేయూత

- రూ.3.25 లక్షలతో 29 అంగన్వాడీ కేంద్రాలకు ఆట వస్తువుల పంపిణీ
- 13 గ్రామాల్లోని చిన్నారులకు ప్రయోజనం



**గుమ్మడిదల, అక్టోబర్ 22 (స్పందన) :**

చిన్నారుల్లో ఆటపాటల ద్వారా అభ్యాసం, మానసిక వికాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా న్యూ ల్యాండ్ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ముందడుగు వేసింది. గుమ్మడిదల మున్సిపాలిటీ, మండల పరిధిలోని 13 గ్రామాల్లో ఉన్న 29 అంగన్వాడీ కేంద్రాలకు రూ.3.25 లక్షల వ్యయంతో ఆట వస్తువులను అందజేసింది.ఈ సందర్భంగా గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అంగన్వాడీ కేంద్రాలకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. చిన్నారులకు ఆటల ద్వారా విద్యను అందించడం, వారిలో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంలో ఆట వస్తువులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమన్నారు.చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన వసతులను కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వ సంస్థలతో పాటు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించవచ్చని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, అంగన్వాడీ ఇన్‌చార్జి కవిత, ఆయా గ్రామాల వార్డు కౌన్సిలర్లు, న్యూ ల్యాండ్ పరిశ్రమ ప్రతినిధులు డివి రెడ్డి, యాదగిరి, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందన
తెలుగు దినపత్రిక




## 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' సినిమా పోస్టర్ లాంచ్

కన్నడ చిత్ర పరిశ్రమలో 'సుప్రీమ్ స్టార్'గా గుర్తింపు తెచ్చుకున్న భార్గవ్ హీరోగా, దర్శకుడిగా తెరకెక్కిస్తున్న కొత్త సినిమా 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు'. ఆరియా మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిస్తున్నారు. కొసల క్రియేటివ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై బండి నాగరాజు నిర్మిస్తుండగా.. మద్దినేని రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ లో ఉంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన 70 శాతం చిత్రీకరణ పూర్తి చేశారు. దసరా పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ చేతుల మీదుగా 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' సినిమా పోస్టర్ లాంచ్ జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఈ సినిమా పోస్టర్ లాంచ్ చేయడం హ్యాపీగా ఉంది. ఇప్పటికే ఈ సినిమా మూడొంతుల షూటింగ్ పూర్తి చేసుకుంది. డిసెంబర్ లో ప్రేక్షకుల ముందుకు ఈ మూవీ రాబోతోంది. హీరో, డైరెక్టర్ భార్గవ్, ప్రొడ్యూసర్ నాగరాజు తో పాటు ఈ మూవీ కోసం కష్టపడుతున్న టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ అందిస్తున్నా. ఈ సినిమా ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. ప్రొడ్యూసర్ బండి నాగరాజు మాట్లాడుతూ మా చిత్ర పోస్టర్ ను ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు లాంచ్ చేసి మాకు బెస్ట్ విశెస్ అందించడం సంతోషంగా ఉంది. మంచి క్వాలిటీతో ప్రొడక్షన్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలు మా సినిమాలో ఉంటాయి. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ మా సినిమాను ఎంజాయ్ చేయవచ్చు. డిసెంబర్ లో మా సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తాం అన్నారు. డైరెక్టర్, హీరో భార్గవ్ మాట్లాడుతూ 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' సినిమాతో తెలుగు ఆడియెన్స్ ముందుకు దర్శకుడిగా, హీరోగా వస్తున్నాను. ఈ అవకాశం కల్పించిన మా ప్రొడ్యూసర్ కు థ్యాంక్స్. మా టీమ్ అందరి సపోర్ట్ తో ఒక మంచి యూత్ ఫుల్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ సినిమా రూపొందిస్తున్నాను. షూటింగ్ మేము అనుకున్నట్లు బాగా జరుగుతోంది. మూవీ క్వాలిటీ, ఔట్ పుట్ తో సంతృప్తిగా ఉన్నాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి డిసెంబర్ లో మా సినిమాను రిలీజ్ కు తీసుకొస్తాం అన్నారు.

## 'వారణాసి' కథలో అదే కీలకం!



'వారణాసి' కేవలం భారీ యాక్షన్, సాహసాలతో కూడిన సినిమా కాదని, విడిపోయిన తండ్రీకొడుకుల బంధం చుట్టూ అల్లుకున్న ఓ భావోద్వేగ ప్రయాణం ఈ కథలో కీలకంగా ఉంటుందని చెప్పారు చిత్ర దర్శకుడు రాజమౌళి. సినిమా షూటింగ్ ఇంకా పది రోజులు మాత్రమే మిగిలి ఉందని ఆయన వెల్లడించారు. మహేష్‌బాబు కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరైన దర్శకుడు రాజమౌళి 'వారణాసి' కథ గురించి ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు. తండ్రీకొడుకుల అనుబంధంతో పాటు అందమైన ప్రేమకథని కూడా ఈ సినిమాలో చూస్తారని తెలిపారు. వారణాసి, అంటార్కిటికా, ఆఫ్రికా నేపథ్యంలో వచ్చే ఘట్టాలు వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయని అన్నారు. 'ఇది సైన్స్ ఫిక్షన్‌లా అనిపించినా..పౌరాణిక అంశాలతో కూడిన ఫాంటసీ చిత్రం. ఆరేడు సినిమాలు ఒకే చిత్రంలో ఇమిడ్చినట్లుగా అనిపిస్తుంది. వాటన్నింటినీ కలుపుతూ భావోద్వేగభరితంగా కథను నడిపించడమే అతి పెద్ద సవాలు' అని రాజమౌళి పేర్కొన్నారు.



## మీ పని మీరు చూసుకోండి..!!

సోషల్ మీడియాలో సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ ట్రోలింగ్ చేయడం రోజురోజుకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా హీరోయిన్ల శరీరాకృతి, వ్యక్తిగత జీవితం గురించి కొందరు నెటిజన్లు అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ హద్దులు దాటుతున్నారు. తాజాగా ఇలాంటి బాడీ షేమింగ్‌పై టాలీవుడ్ హీరోయిన్ ఘాటుగా స్పందించింది. తన శరీరం గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వీడియోలను వైరల్ చేస్తున్న వారిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. నా శరీరం గురించి మాట్లాడే హక్కు మీకు లేదు అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది ఆమె.. ఇంతకూ ఆ హీరోయిన్ ఎవరో కాదు.. ఆమె టాలీవుడ్ క్రేజీ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్. పాయల్ రాజ్‌పుత్ పేరుతో ఎక్స్ షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. "మీకు సిగ్గుండాలి. నా శరీరం గురించి అసహ్యకరమైన కామెంట్లు చేస్తూ, ఆ వీడియోలను షేర్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ సిగ్గుండాలి. నా శరీరం, నా సైజ్, నా గర్వం. ఇవి మీ చర్చలకు, మీ అభిప్రాయాలకు లేదా మీ అశ్లీలతకు సంబంధించిన విషయాలు కావు. మీ పరిధిలో మీరు ఉండండి, మీ పని మీరు చూసుకోండి" అని చెప్పుకొచ్చింది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ పాయల్ రాజ్‌పుత్‌కు మంచి ఫాలోయింగ్ ఉంది. తన ఫొటోలు, సినిమా విశేషాలు, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అప్‌డేట్స్‌ను ఆమె అభిమానులతో పంచుకుంటుంటారు. అయితే సోషల్ మీడియా వేదికగా వచ్చే విమర్శలు, ట్రోలింగ్ విషయంలో సెలబ్రిటీలకు ఎదురవుతున్న ఇబ్బందులు తరచూ వార్తల్లో నిలుస్తుంటాయి. పాయల్ రాజ్‌పుత్ షేర్ చేసిన ఈ పోస్ట్ కూడా ఇదే అంశంపై చర్చకు దారితీస్తోంది.



## ఇలా ఉన్నారేంట్రా..

సోషల్ మీడియా యుగంలో సెలబ్రిటీలకు సంబంధించిన ప్రతి చిన్న విషయం క్షణాల్లో వైరల్ అవుతుంటుంది. కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటి విపరీతమైన పోకడలకు పోతుంటుంది. తాజాగా టాలీవుడ్, సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ అయిన కాయదు లోహర్ గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరలవుతుంది. అంతేకాదు ఆమె ఫ్యాన్ చేసిన ఓ పని ఇప్పుడు అందరిని ఆశ్చర్యపరుస్తుంది. అదేంటంటే.. ఈ యువ హీరోయిన్ కాయదు లోహర్ వాడిన వాటర్ బాటిల్‌కు సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. సెలబ్రిటీలు వాడిన వస్తువులను వేలంలో విక్రయించడం లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడం మనం చూస్తుంటాం, కానీ ఒక వాటర్ బాటిల్‌కు ఏకంగా లక్షల్లో ధర పెట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కాయదు లోహర్ షూటింగ్ స్పాట్‌లో ఉపయోగించి పడేసిన ఒక వాటర్ బాటిల్‌ను ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఆన్‌లైన్ మార్కెట్ ప్లాట్‌ఫారమ్ అయిన ఓఎల్‌ఎక్స్ లో అమ్మకానికి పెట్టాడట. దీనిపై అటు హీరోయిన్ కాయదు లోహర్ అభిమానులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల వ్యక్తిగత వస్తువులను ఇలా ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రస్తుతం ఈ న్యూస్ మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇటీవలే ది ప్యారడైజ్ చిత్రంతో ఆడియన్స్ ముందుకు వచ్చింది కాయదు. ఇప్పుడు ఈ అమ్మడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది.

## 'భోగి' సినిమా నుంచి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటే సాంగ్



చార్మింగ్ స్టార్ శర్వా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర-ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. గ్రామీణ సంప్రదాయాలు, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులతో ముడిపడిన సహజమైన పల్లెటూరి ప్రపంచాన్ని ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి ఆసక్తిని రేకెత్తించగా, తొలి పాట 'ఎగిలివారంగ' సినిమాలోని పల్లె వాతావరణంతో కూడిన సంగీత ప్రపంచాన్ని పరిచయం చేసింది.

దసరాకు ఒక రోజు ముందు మేకర్స్ ఈ సినిమా నుంచి రెండో పాట 'అన్నయ్య పానం' ను విడుదల చేశారు. ఐదుగురు చెల్లెళ్లపై ఒక అన్నయ్య చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతలను హృద్యంగా ఆవిష్కరించే ఈ పాటతో పాటు, ప్రధాన జంట ప్రేమకథకు సంబంధించిన కొన్ని అందమైన క్షణాలను కూడా చూపించారు. పల్లెటూరి మట్టి వాసనతో కూడిన పాటలను అందించడంలో ప్రత్యేకత కలిగిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను మనసు ఆకట్టుకునేల స్వరపరిచారు. భావోద్వేగాల లోతుతో సాగే ఈ మెలోడీ వినగానే ఆకట్టుకుంటుంది. ఆస్కార్ విజేత, గీత రచయిత చంద్రబోస్ సాహిత్యంతో పాటకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనురాగం, త్యాగం, విడదీయలేని అనుబంధాన్ని తన సాహిత్యంలో అందంగా ఆవిష్కరించారు. సింగర్ శ్రీకృష్ణ తన వోకల్స్ తో ఈ పాటకు ప్రాణం పోశారు. ఆయన వాయిస్ పాటలోని భావోద్వేగాలను మరింత పెంచుతుంది. కథలోని రొమాంటిక్ కోణాన్ని కూడా ఈ పాట ఆవిష్కరిస్తుంది. శర్వా, అనుపమ పరమేశ్వరన్ పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించారు. అనీ మాస్టర్ కొరియోగ్రఫీ పాటలోని భావానికి చక్కగా సరిపోగా, సహజమైన పల్లెటూరి వాతావరణం, ఆప్యాయతతో కూడిన కుటుంబ సన్నివేశాలు విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. పల్లెటూరి యువకుడిగా శర్వా తన సహజమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. నిజాయితీతో కూడిన నటనతో తన పాత్రకు భావోద్వేగాల లోతును జోడించారు. పాటలో ప్రధానంగా కనిపించే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆయన నటన మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. పల్లెటూరి అమ్మాయిగా అనుపమ పరమేశ్వరన్ అందంగా ఆకట్టుకున్నారు. అద్భుతమైన నటన, మనసును తాకే సాహిత్యం, అందమైన విజువల్స్ కలగలిసి ఈ పాటను 'భోగి' సంగీత ప్రయాణంలో గుర్తుండిపోయే పాటగా నిలబెట్టాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నారు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780